

నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, శనివారం 12 అక్టోబర్ 2024 | JANAGAON





కాశీబుగ్గలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద రావణవధకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

# విజయీభవ..

చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా విజయదశమిని జరుపుకుంటాం. అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి అశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులపాటు దేవీ నవరాత్రులు, పదో రోజు విజయ దశమి కలిసి దసరా అంటారు. ఈ పండుగ సందర్భంగా రావణ వధ, జమ్మిచెట్టుకు పూజ చేయడం ఆచారంగా వస్తున్నది. దసరా రోజు దుర్గా మాత ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ వేడుకలను జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.

- నేడు విజయదశమి
- వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమైన ఉమ్మడి జిల్లా వాసులు

### ఉత్సవాలకు సర్వం సిద్ధం

కరీమాబాద్: ఉర్సు రంగలీలా మైదానంలో, రంగశాయిపేటలోని మహంకాళి గుడి ఆవరణలో, కాశీబుగ్గలోని చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలోని పద్మానగర్‌లో ఉత్సవ కమిటీలు సర్వం సిద్ధం చేశాయి. ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు కళాకారులతో పలు ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్లతో కనుల పండువగా నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొననున్నారు. వివిధ శాఖల అధికారులు సైతం ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.


వరంగల్‌లో రావణాసురుడి ప్రతిమ


రావణ ప్రతిమకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

పండుగ పూట సొంతూళ్లకు వెళ్దామని బస్టాండ్‌కు వస్తే బస్సుల్లేక.. వచ్చినవి సరిపోక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్లాట్‌ఫాం మీదకు వచ్చిన ప్రతి బస్సు క్షణాల్లో కిక్కిరిసిపోతోంది. దసరా రద్దీ నేపథ్యంలో ఈ నెల 15 వరకు ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలో 900కుపైగా సర్వీసులు నడిపిస్తున్నది. అయితే పలు బస్టాండ్లలో రద్దీ ఎక్కువగా ఉండడంతో బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. – హనుమకొండ చౌరస్తా/మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 11




హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

# బస్సుల్లేవ్.. ఇంటికి పోవుడెట్ల..?

- పండుగ పూట ప్రయాణికుల అవస్థలు
- స్పెషల్ బస్సులపై ఆర్టీసీ బాదుడు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

బస్టాండ్లలో బస్సులు లేక ప్రయాణికులు పిల్లాపాపలతో పడిగాపులు గాస్తున్నారు. బస్సు దొరికితే చాలు కనీసం నిలబడి అయినా వెళ్దామని ఎదురుచూస్తున్నారు. వరంగల్ నుంచి వివిధ రూట్లలో ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్సులను రెగ్యులర్‌తోపాటు ప్రత్యేక బస్సులనూ ఆర్టీసీ నడిపిస్తోంది. డీలక్స్ బస్సునూ ప్రత్యేక బస్సుగానే నడిపిస్తూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నది. దీంతో సూపర్ లగ్జరీ చార్జీలను డీలక్స్ మించిపోయాయి. ప్రత్యేక సర్వీసుల టికెట్ బేసిక్ ధరలో 25 శాతం పెంచేశారు. దీంతో చార్జీలు భారీగా పెరిగాయి. ఇక శనివారం నుంచి 50 శాతం పెంచే అవకాశాలున్నాయి. సూపర్‌లగ్జరీ, రాజధాని, గరుడ బస్సులకు ఆన్‌లైన్ చెల్లింపుల్లో ప్రతి టికెట్‌పై అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. పలుచోట్ల ప్రయాణికులు డ్రైవర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వాహనాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మహబూబాబాద్ నుంచి హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్, ఆదిలాబాద్, వేములవాడ రూట్‌లో ఎక్కువ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్తున్నారు. ప్రధానంగా ఇనుగుర్తి, తాళ్లపూసపల్లి, వేంనూర్ గ్రామాలకు బస్సులు రాక ట్రాలీ ఆటోలు, టాటా ఏస్‌లను ఆశ్రయిస్తున్నారు. కనీసం ఐదారు గంటలు బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తున్నది.



### పైసలు ఎక్కువ తీసుకుంటున్రు..

మా బాబు ఉప్పల్‌లో ఉంటున్నాడు. అక్కడికి వెళ్లాలంటే బస్సుల్లేవు. నర్సంపేట నుంచి వచ్చేటప్పుడు కూడా అంతే. సీటు కూడా దొరకలేదు. హనుమకొండ బస్‌స్టేషన్‌కు వచ్చి గంటైనా బస్సు రాలే. పైసలు ఎక్కువ తీసుకుంటున్రు. చార్జీలు పెంచిన్రు.
– మూడు శత్రువు, ఆకుతండా, నర్సంపేట



### సీఎం ఫ్రీ బస్సు పెట్టి సీట్లు లేకుండ చేసిండు

మహిళలకు ఫ్రీ బస్సు పెట్టి సీట్లు లేకుండ చేసిండు గీ ముఖ్యమంత్రి. మహబూబాబాద్‌కు బస్సుల్లేవు. ఇగొస్తలేవు. అగొస్తలేవు. వచ్చిన బస్సులు నెట్టుకుంటూపోయి ఎక్కుతున్నారు. సీట్లు దొరుకుతలేవు. సీట్ల కోసం ఆడోళ్లు కొట్టుకుంటున్నరు.
– గుగులోత్ లక్ష్మి, నెల్లికుదురు


బస్సు కోసం వస్తున్న దివ్యాంగురాలు


హనుమకొండ బస్‌స్టేషన్‌లో బాటిళ్లు వేసి సీట్లు ఆపుకుంటున్న ప్రయాణికులు

### స్పెషల్ బస్సులపై అదనపు చార్జీలు

వరంగల్ రీజియన్ పరిధిలో దసరా పండుగ సందర్భంగా 900 బస్సులను నడపుతున్నాం. ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా తిప్పుతున్నాం. తిరుగు ప్రయాణానికి అదనంగా 300 బస్సులు తిప్పనున్నాం. స్పెషల్ బస్సులపై అదనంగా 25 శాతం చార్జ్ చేస్తున్నాం. శనివారం నుంచి 50 శాతం పెంచే అవకాశం ఉంది. ఎందుకంటే బస్సు వచ్చేటప్పుడు ఖాళీగా వస్తుంది. హనుమకొండ–హైదరాబాద్, భూపాలపల్లి, మంగపేట వైపు రిజర్వేషన్లు ప్రారంభించాం.
– డీ విజయభాను, ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం


రావిరాలలోని కోమటికుంట చెరువు కట్ట తెగి పొలాల్లో వేసిన ఇసుక మేటలు

నష్టం కొండంత.. పరిహారం గోరంత

# సీఎం హామీ ఇచ్చినా.. సాయం అందలే!

అతి భారీ వర్షాలతో మానుకోట కకావికలమై వరద ధాటికి కూడు, గూడు, గొడ్డూగోద తుడిచిపెట్టుకుపోయాయి. ఊరేదో, ఏరేదో గుర్తుపట్టలేని విధంగా పెను బీభత్సం సృష్టించడంతో ఇల్లు, పంట పొలాలు కోల్పోయి రైతులు, ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 52 సెం.మీ వర్షపాతం కురిసి మానుకోట జిల్లా అల్లకల్లోలమైనప్పటికీ కాంగ్రెస్ సర్కారు మాత్రం పరిహారం విషయంలో బాధితులకు మొండిచేయి చూపింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించి ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ కొందరికే నష్టపరిహారం అందించడంపై బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్‌కు మాట తప్పడం అలవాటుగా మారిందని.. రైతు రుణ మాఫీ.. రైతుభరోసా ఇలా పథకం ఏదైనా తప్పించుకోవడమే పనిగా పెట్టుకుందని 'కొండంత నష్టం జరిగితే గోరంత సాయం' చేసిందంటూ పరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు, ప్రజలు మండిపడుతున్నారు.
- మహబూబాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ)

- వరద బాధితులకు సర్కారు మొండిచేయి
- 40 రోజులుగా రైతులు, బాధితులు ఎదురుచూపులు

ఆగస్టులో కురిసిన అతి భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలోనే మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం వాటిల్లింది. మహబూబాబాద్ జిల్లా ఆకేరు వాగు విలయతాండవం చేయడంతో వాగు చుట్టూ తండాలు, గ్రామాలు, పంటపొలాలు కొట్టుకుపోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సెప్టెంబర్ 1న ఆకేరు వాగు ఉగ్రరూపం దాల్చడంతో వాగు పరివాహక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. మరిపెడ మండలం సీతారాంతండా, ఉల్లేపల్లి, నెల్లికుదురు మండలం సీతారాం తండా, డోర్నకల్ మండలం దుబ్బతండాలు వరద ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఇళ్లు పచ్చని పంట పొలాలు ఆకేరు నీటి ప్రవాహంతో ప్రకృతి మనోహరంగా ఉండే తండాలు, గ్రామాలు ఆగమయ్యాయి.

**ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినా..**

సెప్టెంబర్ 3న స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి మరిపెడ మండలం సీతారాంతండాకు వచ్చి బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తండావాసులకు మరోచోట ప్రభుత్వ స్థలం ఇచ్చి ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో డబ్బులు వేస్తామని చెప్పారు. కానీ నేటికి వరదలు వచ్చి 41రోజులు గడిచినా హామీలకు దిక్కులేకుండా పోయింది. తండాను మార్చడం దేవుడెరుగు నష్టపరిహారం కూడా అందకపోవడంతో తండావాసులు, రైతులు దీనంగా ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 18,406 మంది రైతులకు సంబంధించి 14,669.22 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నిర్ధారించారు. ఎకరాకు రూ.10వేల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి, నిధులు విడుదల చేసినా రైతుల బ్యాంకు ఖాతాలో ఇప్పటివరకు నగదు జమ కాలేదు. వరదల ధాటికి జిల్లాలో 610 ఇళ్లు కూలిపోగా, 1,180 ఇళ్లు వరదలో మునిగిపోయాయి. కూలి పోయిన ఇళ్లకు రూ.16,500, నీట మునిగిన ఇళ్లకు రూ.10వేల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి అరకొరగా అందించి చేతులు దులుపుకొన్నారు.

### కళ్ల ముందు నష్టం కనిపించడం లేదా...



నాకు ఐదెకరాల భూమి ఉంది. 158 సర్వే నంబర్ పురుషోత్తమాయగూడెం పరిధిలో, 110, 148 సర్వే నంబర్ తండా ధర్మారం పరిధిలో ఉంది. అందులో మూడెకరాలు మామిడితోట, మరో రెండు ఎకరాలు వరి వేసిన. వరదకు పంట కొట్టుకుపోవడమే కాకుండా మామిడిచెట్లు కూకటివేళ్లతో లేచిపోయాయి. వ్యవసాయ భూమిలో ఇసుక మేటలు వచ్చి చేరాయి. గియన్ని కండ్ల ముందే ఉన్నా అధికారులు సర్వే చేయాలంటున్నరు. మామిడిచెట్లు లేవు సార్ అంటే అన్నీ పోలేదు కదా అని అధికారులు అంటున్నరు. ఎకరానికి పది వేల రూపాయలు అన్నరు ఇంతవరకు రాకపాయె. పంటలు కొట్టుకుపోగానే సీఎం సర్ వచ్చిండని సంబురపడ్డం. సీఎం వచ్చిపోయినా అధికారులైతే రాలే. మళ్లీ వారానికి ఢిల్లీ సార్‌లు వచ్చిండ్రు.. పోయిండ్రు. ఎమ్మార్వో ఆఫీసోళ్లను అడిగితే అన్ని మామిడిచెట్లు పోయినట్లు అనిపించడం లేదన్నరు. కండ్ల ముంగట పంట నష్టం కనిపిస్తున్నా అధికారులు ఇలా మాట్లాడుదేంది. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా పంట నష్టం రాలేదు.
– గుగులోత్ రాంజీ, సీతారాంతండా, రైతు


### ఆదుకుంటుమన్నరు.. పట్టించుకోవడం లేదు



రెక్కాడితే డొక్కాడని నిరుపేద కుటుంబం మాది. మాకు గుంట భూమి కూడ లేదు. రోజు ఖమ్మం వెళ్లి హోటల్‌లో సప్లయర్‌గా పనులు చేస్తేనే పూట గడిచేది. అర్ధరాత్రి ఆకేరు వాగు మా ఇంటిని ముంచింది. మరో ఫీటు నీళ్లు వస్తే అందరం చచ్చిపోయేటోళ్లం. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ నీళ్లలో కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కేవలం రూ. 10వేలు మాత్రమే ఇచ్చింది. స్వయంగా సీఎం వచ్చినా ఇల్లు చూసిండ్రు. ఢిల్లీ సార్ వాళ్లు కూడా వచ్చిన్రు. ఫొటోలు తీసుకున్నరు. రోజులు గడుస్తున్నా పట్టించుకున్నోళ్లు లేరు. పైరవీ చేయించుకున్నోళ్లకు రూ. 16,500 వచ్చె. గింత అన్యాయం ఉంటదా ఎక్కడన్నా.
– ఇస్లావత్ మంగీలాల్, హోటల్ సప్లయర్


రావిరాలలో దెబ్బతిన్న నష్టపరిహారం అందని బాధితులు

### మాకు నయాపైసా రాలే..



అకాల వరదలతో మా ఇళ్లు నీట మునిగింది. ఇంట్లో బియ్యం, ఉప్పు, పప్పు, అన్ని తడిసి ముదయ్యాయి. మా అత్తమ్మ పేషెంట్, ఇంట్లోకి వచ్చిన వరదతో భయపడి తెల్లవార్లు గోడను పట్టుకొని బిక్కుబిక్కుమంటూ ఉన్నం. వరద రాని ఇళ్లకు డబ్బులు వచ్చాయి. వరదలో మునిగిన మా ఇళ్లను సర్వే చేయలేదు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి నయాపైసా రాలేదు. గ్రామ కార్యదర్శి, తహసీల్దార్‌ను రీ సర్వే చేయాలని అడిగినా పట్టించుకుంటలేరు. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్ముల్ని ఆదుకోవాలి. – చుక్క స్వరూప, రావిరాల, నెల్లికుదురు


సీతారాం తండాలో వరద బాధితుడు మంగీలాల్‌తో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)



















మిగతా దసరా శుభాకాంక్షల ప్రకటనలు
13వ పేజీలో చూడగలరు..